సాక్షి
చిత్తూరు
బుధవారం ၊ 2 ၊ అక్టోబర్ ၊ 2024





## మద్యంధార.. ఇక ఏరులై పారు

కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ అమలు చేసింది. దీంతో ఊరూవాడా ఏరులై పారనుంది.

- 10లో



## తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత బిడ్డలదే

తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత బిడ్డలదేనని పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి లిఖిత పేర్కొన్నారు.

- 10లో



## శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. దర్శన టికెట్లు లేని భక్తులకు సుమారు 18 గంటల సమయం పడుతోంది.

### న్యూస్‌రీల్

## సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

- 3 నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులు
- డీఈఓ దేవరాజు



**చిత్తూరు కలెక్టరేట్:** దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, సంబంధిత పాఠశాలల అనుమతులు రద్దు చేస్తామని డీఈఓ దేవరాజు హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు చెప్పారు. పాఠశాలలు ఈ నెల 14వ తేదీన పునఃప్రారంభించాలన్నారు. దసరా సెలవుల్లో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులను ఇబ్బందులు పెట్టకూడదన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేట్ పాఠశాలలు తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీవైఈఓ, ఎంఈఓలు సంబంధిత పరిధిలో ప్రైవేట్ పాఠశాలలు తరగతులు నిర్వహించకుండా ప్రత్యేక ఫోకస్ పెట్టాలని డీఈఓ దేవరాజు ఆదేశించారు.

## అన్నదమ్ముల్లా మెలగాలి



చెక్కు పంపిణీ చేస్తున్న కలెక్టర్, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, అమ్మా సంస్థ అధినేత

**వి.కోట:** మండలవాసులంతా అన్నదమ్ముల్లా మెలగాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ సూచించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సెప్టెంబర్ 2న వి.కోటలో జరిగిన ఇరువర్గాల ఘర్షణలో నష్టపోయిన 70 మంది కూరగాయలు, పండ్ల వ్యాపారులకు నష్ట పరిహారంగా మండలానికి చెందిన అమ్మా యాక్స్ గ్రూప్ చైర్మన్ దశరథరెడ్డి అందజేసిన రూ.5.32 లక్షల చెక్కును కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నష్టపరిహారం మొత్తాన్ని యాక్స్ సంస్థ అధినేత దశరథరెడ్డి సేవభావంతో చెల్లించడానికి ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. వి.కోట ప్రజలు మత సామరస్యం పాటించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పార్వతి, ఎంపీడీఓ మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

## రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

**పలమనేరు:** జీకేఎఫ్ ఆగ్రోఫారెస్ట్రీ సంస్థ రైతుల నుంచి డబ్బు వసూలు చేయదని, ఎవరైనా తమ సంస్థ పేరిట వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని ఆ సంస్థ పీడీ సయ్యద్‌జానీబాషా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతనెల 28న రైతులను ముంచే ముఠా అనే శీర్షికన సాక్షి దినపత్రికలో వెలువడిన కథనంపై ఆ సంస్థ ఉన్నతాధికారులు స్పందించారు. తమ సంస్థ పేరు చెప్పి రైతుల నుంచి డబ్బు వసూలు చేసిన కొందరు లోకల్ ఏజెంట్లను గుర్తించామని, వారికి ఇప్పటికే నోటీసులు ఇచ్చామని తెలిపారు. తమ సంస్థ రైతులకు ఉచిత సేవలు అందిస్తుందేగానీ ఎవరి నుంచి డబ్బులు కట్టించుకోదని, ఎవరైనా డబ్బులడిగితే రైతులు ఇవ్వకూడదని సూచించారు.

## బోయకొండ హుండీ ఆదాయం రూ.51.93 లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

**చౌడేపల్లె:** మండలంలోని బోయకొండ గంగమ్మ ఆలయానికి హుండీ కానుకల ద్వారా రూ.51.93 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఏకాంబరం తెలిపారు. మంగళవారం ఆలయంలోని హుండీల్లో 57 రోజులుగా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. ఇందులో రూ.51,57,968 నగదు, 61 గ్రాముల బంగారం, 450 గ్రాముల వెండి వచ్చినట్లు పేర్కొన్నారు. విదేశీ కరెన్సీ కూడా వచ్చినట్లు తెలిపారు. అలాగే రణభేరి గంగమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.35,502 ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శశికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమలతో ముఖ్యమంత్రి చంద్రబాబు చెలగాటమాడారు.. మహిమాన్వితమైన శ్రీవారి సన్నిధిని క్షుద్ర రాజకీయాలకు వేదికగా మార్చుకున్నారు. పవిత్ర ప్రసాదంపై అసత్య ఆరోపణలతో విషంగక్కారు. ఏడుకొండలస్వామికి చిత్తశుద్ధితో సేవలందించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దారుణంగా బురదజల్లేందుకు యత్నించారు. కలియుగ వైకుంఠం ప్రతిష్టను దెబ్బతీసేందుకు కుయుక్తులు పన్నారు. అయితే చంద్రబాబుకు సాక్షాత్తు దేవదేవుడే తగిన గుణపాఠం చెప్పారు. సుప్రీం కోర్టు రూపంలో వాస్తవాలను వెలుగులోకి తెచ్చారు. శ్రీవారి భక్తులకు అత్యంత ప్రీతికరమైన లడ్డూలపై తలెత్తిన సందేహాలను పూర్తిగా తొలగించారు. కోట్లాది మంది హిందువుల మనోభావాలను పరిరక్షించారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. దుందుడుకుగా అనుచిత వ్యాఖ్యలు చేసిన చంద్రబాబుపై మండిపడుతున్నారు. ఆయనకు తగుదునమ్మా అంటూ వంతపాడిన పవన్ కల్యాణ్ తదితర కూటమి నేతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సద్బుద్ధితో నడుచుకోవాలని సూచిస్తున్నారు.

– తిరుపతి సిటీ/పలమనేరు/కాణిపాకం/కుప్పం



# పవిత్రం.. ప్రసాదం

- ముఖ్యమంత్రి ఆరోపణలు అవాస్తవం
- శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి పేరిట అసత్య ప్రచారం
- సుప్రీం కోర్టు వ్యాఖ్యలపై భక్తుల హర్షాతిరేకం
- కూటమి నేతల రాద్ధాంతంపై వెల్లువెత్తిన ఆగ్రహం
- సద్బుద్ధితో మెలగాలని సూచిస్తున్న ప్రజానీకం



### సర్కార్‌కు చెంపదెబ్బలు



తిరుమల శ్రీవారి లడ్డూ వ్యవహారంలో కూటమి సర్కారుకు సుప్రీంకోర్టులో చెంప దెబ్బలు పడ్డాయి. దేవుడిని కూడా రాజకీయాల కోసం వాడుకోవడం బాధ్యతా రాహిత్యమని చంద్రబాబుకు చీవాట్లు పడ్డాయి. కోట్ల మంది హిందువుల మనోభావాల్ని దెబ్బతీసేలా ఆరోపణలు చేయడం దారుణం. చంద్రబాబు వేసిన సిట్ దర్యాప్తు నివేదిక సత్యదూరంగానే ఉంటుందని అందరికీ తెలుసు. ప్రభుత్వం తప్పు చేసింది కాబట్టే పవన్‌కల్యాణ్ ప్రాయశ్చితం చేసుకుంటూ దీక్ష చేపట్టారు.

– మద్దిల గురుమూర్తి, తిరుపతి ఎంపీ

### ప్రజలకు అర్థమైంది



ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి ఆధారాలతో పనిలేకుండా, అసలు విషయం తెలుసుకోకుండా అనవసరంగా దేవుడితో రాజకీయాలు చేశారు. ఇది ఎవరికీ మంచిది కాదు. ఇచ్చిన హామీలనుంచి ప్రజల దృష్టిని తప్పించేందుకే ఇలాంటి పన్నాగాలు పన్నారు. ఇది పూర్తిగా ప్రజలకు అర్థమైంది. ఇప్పుడు సుప్రీం ప్రకటనతోనైనా ఆయనకు బుద్ధి చేకూరాలి. భక్తుల మనోభావాలతో ఆటలాడుకోవడం సరికాదు. ఇందుకు కారణమైన వారిని దేవదేవుడు వదిలిపెట్టడు.

– సోమచంద్రారెడ్డి, జిల్లా మేధావుల ఫోరమ్ అధ్యక్షుడు

### ఏడుకొండలవాడే చెప్పించాడు



రాజకీయాలకు దేవుడిని వాడుకోవడం తగదు. సుప్రీం కోర్టు న్యాయమూర్తుల మాటలు వింటే సాక్షాత్తు ఆ ఏడుకొండలవాడే చెప్పించినట్టు అనిపించింది. రాజకీయ నేతలు ఎవరి మత విశ్వాసాలు, మనోభావాలను దెబ్బతీసేందుకు ప్రయత్నించకూడదు. అబద్ధం వెంటనే జనంలోకి వెళ్లిపోయినా, నిజం నిలకడగా అయినా తెలుస్తుంది. అప్పుడు సదరు నాయకుల స్థాయి పడిపోతుంది. శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ కాలేదనే వాస్తవంతో సంతోషమేసింది.

– విజయ్‌కుమారస్వామి, కీలపట్ల

### ఇది మహాపచారం



స్వామివారి ప్రసాదంపై అభ్యంతరకరమైన వార్తలు వినడం దురదృష్టకరం. నిజానిజాలు తెలియకుండా దుష్ప్రచారం చేయడం మంచిదికాదు. అలా చేస్తే స్వామివారి ఆగ్రహానికి గురికాక తప్పదు. శ్రీవేంకటేశ్వర స్వామి భక్తులను తప్పుదోవపట్టించేందుకు ప్రయత్నించిన వారు ఎవరూ మనుగడ సాగించలేదు. శ్రీవారికి ఇది నిజంగా మహాపచారం. దీనిపై సుప్రీం కోర్టు సైతం అక్షింతలు వేసిందంటే ఈ ప్రభావం భక్తులలో ఎలా ఉంటుందో ఆలోచించాలి.

– శేషాచలేశ్వరాచార్యులు, అర్చకుడు, తమిళనాడు

### భక్తులకు భరోసానిచ్చింది.



శ్రీవారి ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడకంపై వస్తున్న వార్తలకు సుప్రీం కోర్టు బ్రేక్ వేసినట్టయింది. భక్తులకు భరోసా ఇచ్చింది. ఎంతో పవిత్రంగా భావించే స్వామివారి ప్రసాదానికి దేశ, విదేశాలలో అత్యంత ప్రాధాన్యత ఉంది. ప్రసాదంతో రాజకీయాలు చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడటం దారుణం. కల్తీ విషయంలో కచ్చితమైన సమాచారం ఉంటే అధికారులు, పండితులు మాట్లాడాలి. రాజకీయ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం అపచారం.

– వరదరాజులస్వామి, తిరుపతి రూరల్

### రాజనీతికి వ్యతిరేకం



దేవుళ్లతో రాజకీయాలు చేయడం. తమ అవసరాలకు తగ్గట్టు మాట్లడడం చాలా ప్రమాదకరం. ఇది రాజనీతికి వ్యతిరేకం. కలియుగ దైవం ఎంతో మంది భక్తులను నిత్యం తన వద్దకు రప్పించుకుని దర్శన భాగ్యంతో ఆశీస్సులు అందజేస్తున్నారు. ఆ సమయంలో తన వద్దకు వచ్చిన భక్తులకు ఇచ్చే మహా ప్రసాదమే లడ్డూ. అటువంటి ప్రసాదంపై అభాండాలు మోపడం ఎంతవరకు సమంజసం. శాస్త్రాలు సైతం ఇలాంటి వాటిని సమ్మతించదు.

– మణికంఠ, అర్చకుడు, తిరువళ్లూరు

### సమంజసం కాదు



శ్రీవారి లడ్డూను అడ్డంపెట్టుకుని చంద్రబాబు, పవన్ కల్యాణ్ రాజకీయం చేశారు. లడ్డూ పవిత్రతను దెబ్బతీసేందుకు యత్నించారు. భక్తుల మనోభావాలు దెబ్బతిసేలా వ్యవహరించారు. చేసిందంతా చేసి మళ్లీ ప్రతిపక్షంపై బురద జల్లడం సమంజసం కాదు. సుప్రీంకోర్టు అందుకే మొట్టికాయలు వేసింది. తిరుమల శ్రీవారే వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చారు. కూటమి నేతలు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలి.

– వెంకటరత్నం, కార్వేటినగరం

### సత్యం బయటపడింది



తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు అన్యాయంగా ఆరోపణలు చేశారు. పైగా అప్పటి ప్రభుత్వంపై బురదజల్లారు. క్షుద్ర రాజకీయాలను దేవుడు కూడా క్షమించడు. అందుకే సుప్రీం కోర్టులో చంద్రబాబుకు అక్షింతలు పడ్డాయి. ఇన్నాళ్లుగా చేసిన విష ప్రచారం ప్రజలకు అర్థమైంది, సత్యం బయటపడింది. మరోసారి ఇలాంటి కుట్రలకు తెరతీయకుండా ముఖ్యమంత్రి మంచిగా మారాల్సిన అవసరముంది.

– నాగార్జున, ఐరాల

### క్షమాపణ చెప్పాల్సిందే



శ్రీవారి లడ్డూకు వినియోగించిన నెయ్యి కల్తీ అనే వార్త వినగానే గుండె పగిలినంత పనైంది. అయ్యో దేవుడా ఏమిటిది అనుకుంటూ చాలా బాధపడ్డాం. అయితే సుప్రీంకోర్టు విచారణలో నిజనిజాలు బయటకు వచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎలాంటి ఆధారాలు లేకుండా తప్పుడు ప్రచారం చేశారనే వాస్తవం అందరికీ అర్థమైంది. ఇంత దారుణానికి తెగించిన కూటమి నేతలు భక్తులకు క్షమాపణలు చెప్పాల్సిందే. లేకుంటే వారి పాపానికి పరిహారం ఉండదు.

– తేజశ్విత, యాదమరి

### ఆరోపణలు బాధాకరం



తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి పవిత్ర ప్రసాదమైన లడ్డూలో కల్తీ నెయ్యి కలిసిందనే ఆరోపణలు బాధాకరం. ఏది ఏమైనా రాజకీయాలకు దేవదేవుడిని వాడుకోవడం దురదృష్టకరం. కోట్ల మంది శ్రీవారి భక్తుల మనోభావాలతో ఆడుకోవడం దారుణం. ఇప్పుడు సుప్రీం కోర్టు వ్యాఖ్యలతో మా మనసులు శాంతిస్తున్నాయి. ఇన్నాళ్లుగా మనోవేదనకు గురిచేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కచ్చితంగా భక్తకోటికి క్షమాపణలు చెప్పాలి.

– బాల సుబ్రమణ్యస్వామి, కుప్పం

## వైభవంగా శ్రీవారి గొడుగుల ఊరేగింపు



పుత్తూరులో శ్రీవారి గొడుగుల ఊరేగింపు

**పుత్తూరు:** విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీవారి గొడుగుల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. టీటీడీ వార్షిక బ్రహ్మోత్సవాల నిమిత్తం చెన్నై నుంచి తిరుమలకు వెళుతున్న శ్రీవారి గొడుగులు మంగళవారం ఉదయం పుత్తూరుకు చేరుకోగానే మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక ఆర్డీఎం గేటు వద్ద శ్రీవారి పాదుకలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివానందస్వామి, కైలాస నందగిరిస్వామి, కృష్ణ చైతన్యస్వాముల వారు ఊరేగింపును ప్రారంభించారు. అంబేద్కర్ సర్కిల్, నగరం రోడ్డు, కాపువీధి, బజారువీధి, సుబ్రమణ్యంస్వామి ఆలయం, ధర్మరాజులస్వామి ఆలయం వరకు ఊరేగింపు కొనసాగింది. అడుగడుగునా శ్రీవారి పాదుకులకు భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు.

## కాణిపాకం హుండీ ఆదాయం రూ.2,15 కోట్లు



హుండీ లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

**కాణిపాకం:** వరసిద్ధి వినాయకస్వామి ఆలయ హుండీలను మంగళవారం లెక్కించారు. హుండీ ద్వారా రూ.2,15,30,322 భక్తులు కానుక రూపంలో సమర్పించుకున్నారు. అలాగే బంగారం 90 గ్రాములు, వెండి 1.295 కిలోలున్నాయి. గో సంరక్షణ హుండీ లెక్కించగా రూ.29,513, నిత్యాన్నదానం హుండీ నుంచి రూ.44,159, విదేశీ కరెన్సీ యూఎస్ఏవీ 947 డాలర్లు, యూఏఈ 120 దిర్హామ్, మలేషియావి 406 రింగిట్, ఆస్ట్రేలియావి 10 డాలర్లు, యూరోప్‌వి 150 యూరోలు, ఇంగ్లాండ్‌వి 55 పౌండ్స్, కెనడా 110 డాలర్స్ వచ్చినట్లు ఈఓ గురుప్రసాద్ తెలిపారు. ఏఈఓలు రవీంద్రబాబు, కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, పర్యవేక్షకులు కోదండపాణి, శ్రీధర్‌బాబు, మల్లికార్జున పాల్గొన్నారు.

## బోయకొండ ఈఓ ప్రొటోకాల్ ఉల్లంఘన

- ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, ఎమ్మెల్సీ భరత్‌కు దక్కని గౌరవం
- దసరా ఉత్సవాల్లో టీడీపీ నేత చల్లాబాబు, ఎమ్మెల్సీ శ్రీకాంత్‌కు ప్రొటోకాల్ ఉందా?
- ఎంపీ మిథున్‌రెడ్డి ఫిర్యాదు



ప్రత్యేకంగా ముద్రించిన చల్లా బాబు ఫొటో



ఎంపీ, ఎమ్మెల్యేల ఫొటోలను చివరన ముద్రించిన చిత్రం

**సాక్షి టాస్క్‌ఫోర్స్:** జిల్లాలోని బోయకొండ గంగమ్మ ఆలయ ఈఓ ఏకాంబరం ఓవరాక్షన్ వివాదాలకు దారితీస్తోంది. స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్ కు తగిన ప్రొటోకాల్ ఇవ్వకుండా వారి పేర్లను ఆహ్వాన పత్రికల్లో చిట్టచివరన వేశారు. అలాగే ఏ అర్హత లేని టీడీపీ నేత చల్లా రామచంద్రారెడ్డికి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌పై ఈఓ ఎనలేని ప్రేమను చూపిస్తూ ఆహ్వాన పత్రిక రూపొందించడంపై ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి పలువురికి మంగళవారం ఫిర్యాదు చేశారు. బోయకొండ అమ్మవారి దసరా వేడుకలు ఈనెల 4 నుంచి నిర్వహిస్తున్నట్టు ఈఓ ఏకాంబరం రూ.లక్షలు ఖర్చుచేసి అధికార పార్టీపై ఎనలేని ప్రేమను చూపుతూ ఆహ్వాన పత్రికలు, కరపత్రాలు ముద్రించారు. ఇందులో ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా వారి పేర్లు చివరన ముద్రించారు. అలాగే ఎమ్మెల్సీ భరత్ ఫొటో లేకుండా పేరును మాత్రమే ముద్రించారు. ఎలాంటి అర్హత లేని చల్లా రామచంద్రారెడ్డి ఫొటోను ప్రత్యేకమైన పేజీలో ముద్రించడమే కాకుండా ఆయన అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారంటూ ఆయనపై అమితమైన ప్రేమను కురిపించారు. అలాగే కుప్పం టీడీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు ప్రొటోకాల్ కల్పించారు. చల్లా బాబును పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా పేర్కొనడం ఆ పార్టీ నాయకులకు సైతం విస్మయానికి గురిచేస్తోంది. ఈ విషయాలపై ఎంపీ మిథున్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ ఉల్లంఘించిన ఈఓపై జిల్లా కలెక్టర్‌కు, దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణకు, పార్లమెంట్, అసెంబ్లీ కార్యదర్శులకు ఫిర్యాదు చేశారు.

## విద్యార్థులందరికీ ఆధార్ తప్పనిసరి

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ఆధార్ కార్డు తప్పనిసరి అని డీఈఓ దేవరాజు సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖాధికారుల ఆదేశాల మేరకు దసరా సెలవుల్లో ఆధార్ కార్డు లేని విద్యార్థులు ఆధార్ కోసం దరఖాస్తు చేసుకునేలా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 14 తర్వాత ఆధార్ కార్డు లేకుండా ఏ విద్యార్థి ఉండకూడదన్నారు. యూడైస్ ప్లస్‌లో విద్య నభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి ఆధార్ కార్డు నంబర్‌ను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కసరత్తు అన్ని యాజమాన్యాల పాఠశాలల హెచ్‌ఎంలు, నిర్వాహకులు పకడ్బందీగా పర్యవేక్షించాలని డీఈఓ ఆదేశించారు.

## టెట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- రేపటి నుంచి పరీక్షలు
- 9032185001 నంబర్‌కు కాల్ చేస్తే సందేహాలు నివృత్తి
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన రాష్ట్ర అబ్జర్వర్ ప్రసన్నకుమార్

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలో, తమిళనాడు రాష్ట్రం చెన్నైలో ఈ నెల 3 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించే టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష)కు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర అబ్జర్వర్ ప్రసన్నకుమార్ తెలిపారు. మంగళవారం జిల్లాకు విచ్చేసిన ఆయన పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, ఏర్పాట్లు పర్యవేక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టెట్‌కు చిత్తూరు జిల్లాలో నాలుగు (సీతమ్స్, వేము, ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలు), పలమనేరులో మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాల, తమిళనాడు రాష్ట్రం చెన్నైలో కుంద్రత్తూర్‌లోని ఐయాన్ డిజిటల్ జోన్, వనాగరమ్‌లోని ప్రయాగ టెక్నాలజీస్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నిర్ణీత షెడ్యూల్‌లో ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మొదటి సెషన్ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు www.cse.ap.gov.in వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

**ముందస్తుగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి**

అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ముందస్తుగా చేరుకోవాలని ప్రసన్నకుమార్ సూచించారు. ఆలస్యంగా వస్తే అనుమతి ఉండదన్నారు. పరీక్ష కేంద్రానికి విచ్చేసే అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు తప్పనిసరిగా గుర్తింపు కార్డు (ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు, తదితర ప్రభుత్వ గుర్తింపు కార్డులు) తీసుకురావాలన్నారు. దివ్యాంగ అభ్యర్థులకు అధికారికంగా ఏర్పాటు చేసిన స్క్రైబ్‌లకు అదనంగా 50 నిమిషాలు కేటాయిస్తామన్నారు. అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ హాల్‌టికెట్‌లు పొందినట్‌లైతే ఏదో ఒక పరీక్ష కేంద్రంలో మాత్రమే పరీక్షకు హాజరు కావాలన్నారు. నిబంధనల ప్రకారం ఒక అభ్యర్థి స్థానంలో మరొకరు పరీక్షకు హాజరైనా, ఎటువంటి మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు**

పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని చెప్పారు. హాల్‌టికెట్‌లో ఫొటో లేకపోయినా, సరిగ్గా కనిపించకపోయినా, చిన్నసైజులో ఉన్నా అభ్యర్థి తన సరైన 2 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను తీసుకెళ్లి డిపార్ట్‌మెంట్ అధికారికి సమర్పించి అనుమతి పొందాలన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌లో తప్పులు ఉన్నట్‌లైతే పరీక్ష కేంద్రంలో డిపార్ట్‌మెంట్ అధికారికి సరైన ఆధారాలు చూపించి నామినల్‌రోల్స్‌లో సరిచేయించుకోవాలన్నారు. అభ్యర్థి పేరు, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ, సామాజిక వర్గం, జెండర్, ఎక్స్‌సర్వీస్‌మెన్, ఫొటో, అభ్యర్థి సంతకం, మొబైల్ నంబర్, ఆధార్ నంబర్ వివరాలు సరిచేసుకోవచ్చన్నారు. పరీక్షలు రాసే అభ్యర్థులకు ఏవైనా సందేహాలు, సమస్యలు తలెత్తితే డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్ 9032185001 నంబర్‌కు కాల్ చేసి నివృత్తి చేసుకోవాలని రాష్ట్ర అబ్జర్వర్ వెల్లడించారు.

## క్లుప్తంగా

### మృతురాలి చిరునామా తెలపండి


మార్చురీలో ఉన్న గుర్తుతెలియని మహిళ మృతదేహం(ఫైల్)

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఘాట్ వద్ద గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెందిందని, ఇంత వరకు మృతురాలి చిరునామా లభించలేదని సీఐ శ్రీనివాసులు తెలిపారు. గతనెల 28వ తేదీ మొగిలి ఘాట్ వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి పక్కన నడుచుకుంటూ వెళుతున్న గుర్తుతెలియని మహిళను లారీ ఢీకొన్న విషయం తెలిసిందేనన్నారు. గుర్తుతెలియని మహిళ చిరునామా కోసం నాలుగు రోజులుగా ప్రయత్నిస్తున్నామన్నారు.రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహిళ 5.5 ఎత్తు కలిగి 50–60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉంటుందన్నా రు. ఎరుపు రంగు కలిగి ఉందన్నారు. మెడలో నల్లపూసల దండ ఉందన్నారు. నలుపు రంగు లెగ్ఇన్, బ్లూ రంగు టాప్ ధరించి ఉందని తెలిపారు. మృతదేహాన్ని స్థానిక బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరచినట్లు తెలిపారు. మృతురాలి చిరునామా తెలిసినవారు 9440796736 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### సీసీ టీవి, సెక్యూరిటీ అలారమ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఈ నెల 7వ తేదీ నుంచి 13 రోజుల పాటు పురుషులకు సీసీ టీవి ఇన్‌స్టాలింగ్, సర్వీసింగ్‌తో పాటు సెక్యూరిటీ అలారమ్, స్మోక్ డిటెక్టర్‌పై ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ పి. సురేష్ బాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల గ్రామీణ ప్రాంతానికి చెందిన 10వ తరగతి ఉత్తీర్ణులైన 19 ఏళ్ల నుంచి 45 ఏళ్ల నిరుద్యోగ పురుషులు అర్హులన్నారు. శిక్షణ సమయంలో ట్రైనీస్‌కి హాస్టల్ సౌకర్యం, ఉచిత భోజనం, రాను పోను ఒకసారి చార్జీ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ అందిస్తామన్నారు. ఆసక్తిగలవారు ఆధార్, రేషన్ కార్డు జెరాక్స్ కాపీలు, 4 పాసు పోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి పేరు నమోదు చేయించుకో వాలన్నారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11–48 ద్వారకానగర్ కొత్తపేట,చంద్రగిరి, లేదా 79896 80587, 94949 51289, 83091 64644 సంప్రదించాలన్నారు.

ఇక నుంచి జిల్లాలో మద్యం ఏరులై పారనుంది. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రభుత్వ మద్యం దుకాణాలను తొలగిస్తూ.. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని అమలు చేసింది. ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు పచ్చ జెండా ఊపేసింది. ఇక తాగినోడికి తాగినంత తాపించడమే లక్ష్యంగా ప్రైవేటు వ్యాపారులకు రెండేళ్ల పాటు లైసెన్సులు జారీ చేయనుంది.

# మద్యంధార.. ఇక ఏరులై పారు



**తాగినోడికి తాగినంత..!**
- ప్రైవేటు మద్యం దుకాణాలకు నోటిఫికేషన్
- జిల్లాలో 104 నూతన మద్యం దుకాణాల ఏర్పాటు
- తాగించడం..ఆదాయం రాబట్టడమే లక్ష్యంగా పాలసీ
- దరఖాస్తుల స్వీకరణ ఆరంభం.. ఈనెల 9 వరకు గడువు
- 11న లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయింపు

చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాలో 104 మద్యం దుకాణాల ఏర్పాటుకు మంగళవారం నోటిఫికేషన్ ఇచ్చిన అధికారులు.. దరఖాస్తులను కూడా ఆన్‌లైన్‌లో తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ మద్యం దుకాణాలతో పోలిస్తే ప్రైవేటు దుకాణాల్లో మద్యం అమ్మకాలు జరిగే సమయాన్ని గంట పెంచుతూ మందు బాబులకు ఆఫర్ కూడా ఇచ్చారు. ఫలితంగా ఉదయాన్నే తాగి కుటుంబంలో గొడవలకు దిగే అవకాశాన్ని కల్పించినట్లు అయ్యింది. ఇక మద్యం దుకాణాల దరఖాస్తు రుసుమును రూ.2 లక్షలు (నాన్–రీఫండబుల్)గా నిర్ణయించారు. అయితే లైసెన్సు ఫీజును మాత్రం భారీగా పెంచేశారు. వ్యాపారులకు వచ్చే లాభాలు 20 శాతంగా చెప్పిన ప్రభుత్వం.. పన్నులు మినహాయిస్తే 14 శాతం వరకు వస్తుందనే విషయాన్ని దాచేసింది.

**జిల్లాలో రెండు శ్లాబులు**

ప్రభుత్వ మద్యం దుకాణాల సంఖ్యను ఏమాత్రం పెంచకుండా యథావిధిగా దుకాణాలకు నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ లైసెన్సు ఫీజులను భారీగా పెంచేసింది. మొత్తం నాలుగు శ్లాబులు ఉన్నప్పటికీ జిల్లాలోని జనాభా ప్రాతిపదికన రెండు శ్లాబులు మాత్రమే వర్తిస్తుంది. ఇందులో 50 వేల లోపు జనాభా ఉంటే శ్లాబ్–2, 50 వేల పైనుంచి 5 లక్షల్లోపు జనాభా ఉంటే శ్లాబ్–3గా విభజించారు. శ్లాబ్–2 ప్రకారం 34 దుకాణాలను చూపించిన అధికారులు ఇక్కడ ఏడాదికి లైసెన్సు ఫీజును రూ.55 లక్షలుగా నిర్ణయించారు. శ్లాబ్–3లో 70 దుకాణాలు ఏర్పాటు చేసి ఏడాది లైసెన్సు ఫీజును రూ.65 లక్షలుగా నిర్ణయించారు. ఏడాది తరువాత లైసెన్సు ఫీజులో 10 శాతం పెంచుతారు.

2017లో ఇదే టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌లో శ్లాబ్–2కు లైసెన్సు ఫీజు రూ.10 లక్షలుండగా, శ్లాబ్–3కు రూ.12.50 లక్షలు ఉండడం గమనార్హం.

**గీత కార్మికులకు తరువాత..**

కూటమి ప్రభుత్వం ఇచ్చిన మానిఫెస్టో ప్రకారం కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం అధికారులు విడుదల చేసిన నోటిఫికేషన్‌లో గీత కార్మికుల ప్రస్తావన లేదు. తొలి విడత ప్రక్రియ పూర్తయితే, ఆపై గీత కార్మికుల కోసం ప్రత్యేక నోటిఫికేషన్ ఇచ్చే అవకాశాలున్నాయి. వీళ్లకు లైసెన్సు ఫీజు, దరఖాస్తు ఫీజులో ఏవైనా రాయితీలు ఇస్తారా? అనేది నోటిఫికేషన్ విడుదలైతే తప్ప తెలియదు.

**ఆ కుటుంబాలు రోడ్డుకు..**

ఇక ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సేల్స్ మెన్లు, సూపర్‌వైజర్లు, కాపలాదారుల గురించి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. చిత్తూరు జిల్లాలో 113 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో దాదాపు 500 మంది వరకు పనిచేస్తున్నారు. వారికి ఎలాంటి ఉద్యోగ భద్రత కల్పించకపోవడంతో నూతన పాలసీ అమల్లోకి వస్తున్న వేళ.. వారంతా రోడ్డున పడాల్సిన పరిస్థితి నెలకొంది.

**ఇక ప్రైవేటు మద్యం దుకాణాలు**

నూతన మద్యం పాలసీలో మద్యం దుకాణాలన్నీ కూడా ప్రైవేటు వ్యక్తుల నిర్వహణకు అనుమతిస్తున్నట్లు చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. పాలసీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను మంగళవారం చిత్తూరులోని తన కార్యాలయంలో విడుదల చేశారు. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్, చిత్తూరు ఈఎస్ శ్రీనివాస్, ఏఈఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి, చిత్తూరు అర్బన్ సీఐ శ్రీహరితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తుల ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లోనే ఉంటుందన్నారు. వ్యాపారులు ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్‌లో దుకాణాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, అలా చేసుకోలేనివారు ఏదైనా ఎక్సైజ్ స్టేషన్‌కు వెళ్లి వివరాలు అందిస్తే, అధికారులు ఆన్‌లైన్ చేస్తారన్నారు. ఈనెల 11వ తేదీన జరిగే లాటరీ రోజున దరఖాస్తుదారుడు వస్తే సరిపోతుందన్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే కల్లుగీత కార్మికులకు దుకాణాల కేటాయింపుపై ప్రత్యేక నోటిఫికేషన్ ఇస్తామన్నారు. ఒక వ్యక్తి ఎన్ని దుకాణాలకైనా, ఎన్ని దరఖాస్తులైన వేయవచ్చని.. లాటరీ పద్ధతిలో ఒక్కో దుకాణానికి, ఒక దరఖాస్తును తీసి లైసెన్సు కేటాయిస్తామన్నారు. ఇక లైసెన్సు వచ్చిన వ్యక్తి ఈనెల 12వ తేదీ నుంచి దుకాణాలు నిర్వహించుకోవచ్చన్నారు. లైసెన్సు ఫీజును ఆరు విడతలుగా చెల్లించడానికి వీలు కల్పించినట్లు తెలిపారు. దరఖాస్తులను https://hpfsproject.com అనే వెబ్‌సైట్ ద్వారా అందచేయొచ్చని తెలిపారు.


నోటిఫికేషన్ విడుదల చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

**పాలసీలోని ప్రధాన అంశాలు**

- దరఖాస్తు రుసుము : రూ.2 లక్షలు (తిరిగి ఇవ్వరు)
- దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరు : ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గం.ల్లోపు
- లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు : 11వ తేదీ ఉదయం 8 గంటల నుంచి..
- లాటరీ తీసే ప్రదేశం : చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ కల్యాణ మండపం
- ప్రైవేటు మద్యం అమ్మకాలు ప్రారంభం : 12వ తేదీ నుంచి
- మద్యం విక్రయ వేళలు : ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు
- మద్యం లైసెన్సు గడువు : 2024–2026 (సెప్టెంబర్ 30వ తేదీ వరకు)

**ఎక్కడ ఎన్ని దుకాణాలంటే..**

జిల్లాలో ఎనిమిది సర్కిళ్లు ఉంటే ఆయా స్టేషన్ల వారీగా దుకాణాలున్నాయి. ఇందులో చిత్తూరు అర్బన్‌లో 22 దుకాణాలు, చిత్తూరు రూరల్ 19, నగరి 11, కార్వేటి నగరం 8, పుంగనూరు 14, పలమనేరు 13, కుప్పంలో 10, పులిచెర్లలో 7 దుకాణాలు ఏర్పాటు చేశారు.

# జిల్లాలో ప్రభుత్వ మద్యం దుకాణాలు బంద్

- ఉద్యోగ భద్రత కల్పించాలంటూ నిరసన
- పెండింగ్ వేతనాలు చెల్లించలేదని ఆవేదన
- సోమవారంతో ముగిసిన ఔట్ సోర్సింగ్ సిబ్బంది కాంట్రాక్టు
- తమకెలాంటి హామీ లేనపుడు దుకాణాలు తెరవమంటున్న వైనం



పలమనేరులో నిరసన తెలుపుతున్న మద్యం దుకాణాల సిబ్బంది

పలమనేరు: జిల్లాలో ప్రభుత్వ మద్యం దుకాణాలు మంగళవారం మూతబడ్డాయి. ఆయా ప్రాంతాల్లో దుకాణాల్లో ఇన్నాళ్లు పనిచేసిన ఔట్‌సోర్సింగ్ సిబ్బంది గడువు సోమవారంతో ముగిసింది. ఈనెల 12వ తేదీ నుంచి ప్రైవేటు మద్యం షాపులు రానున్నాయి. ఈ నేపథ్యంలో తమకు ఉద్యోగ భద్రత, పాత బకాయులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ షాపుల్లోని సిబ్బంది మంగళవారం మద్యం దుకాణాలను బంద్ చేసి షాపుల ముందు నిరసనలకు దిగారు. ఈ పది రోజులు పనిచేసినా ప్రయోజనం లేదని తమకు ఎలాంటి హామీ ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం తొలగించడంపై మండిపడుతున్నారు.

**480 మంది ఉద్యోగాలు ఔట్**

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో వందకుపైగా ప్రభుత్వ మద్యం దుకాణాలున్నాయి. ఇందులో పట్టణాల్లోని దుకాణాల్లో ప్రతి దుకాణానికి ఓ సూపర్‌వైజర్, ముగ్గురు సేల్స్‌మెన్లు, ఓ వాచ్‌మెన్ ఉన్నారు. అదే మండలాల్లో అయితే ఓ సూపర్‌వైజర్, ఇద్దరు సేల్స్‌మెన్లు, ఓ వాచ్‌మెన్ ఉన్నారు. ఆ లెక్కన సెబ్ పరిధిలోని వంద దుకాణాల్లో మొత్తం 480 మంది వరకు విధుల్లో ఉన్నారు. వీరిలో సూపర్‌వైజర్‌కు నెలకు రూ.19 వేలు, సేల్స్‌మెన్లకు రూ.16,500, వాచ్‌మెన్లకు రూ.12 వేలుగా వేతనాలు ఇస్తున్నారు. గత రెండు నెలలుగా వేతనాలను సైతం ఇవ్వలేదని వారు చెబుతున్నారు.

**ఏదేనీ హామీ ఇస్తారేమోనని ఆఖరిప్రయత్నం**

ఇలా ఉండగా కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ కారణంగా ప్రైవేట్ ఏజెన్సీలు మద్యం షాపులను ఈనెల 12వ తేదీ నుంచి నిర్వహించనున్నాయి. అయితే ఇప్పటివరకు ప్రభుత్వ మద్యం షాపుల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ప్రైవేటు షాపుల్లోనైనా అవకాశం కల్పిస్తారేమోనని వారు భావించారు. కానీ సోమవారంతో వీరి కాంట్రాక్టు ముగియడం, ఇంతవరకు వారికి ఎలాంటి హామీ లేకపోవడంతో ఉన్నట్టుండి వీరంతా సమ్మెకు దిగి మద్యం దుకాణాలను మూసేశారు. ఉన్నట్టుండి షాపును నడపడం ఎక్సైజ్‌శాఖ నుంచి కానిపనిగానే మారింది. అయితే ఈ పదిరోజుల దుకాణాలను ఎలా నిర్వహిస్తారనేది నేడో రేపో తెలియనుంది. ఈ విషయమై జిల్లా ఎక్సైజ్ అధికారులనడిగినా ఇందంతా ప్రభుత్వ పాలసీ అని, తమకెలాంటి సంబంధం లేదంటున్నారు.

**బోర్డర్లకు పరుగులు తీస్తున్న మందు బాబులు**

ఉన్నఫలంగా మద్యం దుకాణాలు మూతపడడంతో మందు బాబులు సమీపంలోని కర్ణాటక, తమిళనాడు బాట పట్టారు. ఇదే అదునుగా పట్టణాల్లోని కొన్ని బార్ అండ్ రెస్టారెంట్లలో డిమాండ్‌ను చూసి మద్యం ధరలను సైతం పెంచినట్టు సమాచారం. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా ఎలాగూ మద్యం దుకాణాలుండవు. దీంతో మందు బాబులు బోర్డర్ల బాట పట్టారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


నాగభూషణం మృతదేహం

గంగవరం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి తిరుపతిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కల్లుపల్లి దళితవాడకు చెందిన నాగభూషణం (50) కూలి పనులు చేసుకుని జీవించేవాడు. గత ఆదివారం తన చిన్న కొడుకుతో కలిసి ద్విచక్ర వాహనంలో పలమనేరుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. పలమనేరు – మదనపల్లి జాతీయ రహదారిలోని మేలుమాయి క్రాస్ సమీపంలో కంటైనర్ లారీ అతడి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగభూషణం తలకు తీవ్ర గాయం కాగా, కొడుకు సురక్షితంగా బయటపడ్డాడు. స్థానికుల సహాయంతో క్షతగాత్రుడిని చికిత్స కోసం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించి, కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. అక్కడ అతని పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు. తిరుపతిలో రెండు రోజులుగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి కంటైనర్ లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

# గాయపడిన మహిళ మృతి

బంగారుపాళెం: మండలంలోని కొత్తపల్లె బ్రిడ్జిపై గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్‌ఐ రామచంద్రారెడ్డి తెలిపారు. గత నెల 14 వ తేదీ కర్ణాటకలోని దొడ్డబళ్లాపుర్ నుంచి కంచికి వెళుతున్న కారు కొత్తపల్లె బ్రిడ్జిపై అదుపు తప్పి రహదారి పక్కన రక్షణగోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో సంఘటనా స్థలంలో ఇద్దరు మృతి చెందగా ఐదుగురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందేనన్నారు. గాయపడిన వారిలో బెంగళూరు రూరల్ దొడ్డబళ్లాపుర్ కంటేకుంటికి చెందిన నరసింహ మూర్తి భార్య తనూజ(40) ఎలహంక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ 17 రోజుల తరువాత మృతి చెందిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# బ్రహ్మోత్సవాలకు ఆర్టీసీ సిద్ధం


ఆర్టీసీ ఎండీ, డీజీపీ ద్వారక తిరుమలరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీపీటీఓ

తిరుపతి అర్బన్ : తిరుమల బ్రహ్మోత్సవాలకు ఆర్టీసీ సిద్ధంగా ఉందని కడప జోన్ ఈడీ, జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఈ మేరకు తిరుమలలో ఆర్టీసీ ఎండీ, డీజీపీ ద్వారకా తిరుమలరావును కలిశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఇప్పటికే ఐదు దశలుగా ఆర్టీసీ సర్వీసులను తనిఖీలు చేశామన్నారు. ప్రతిరోజు 1,930 ట్రిప్పులు తిప్పడానికి సన్నాహాలు పూర్తి చేసినట్లు వెల్లడించారు. దీంతో రోజుకు 1.70 లక్షల మంది భక్తులకు తిరుపతి–తిరుమలకు రాకపోకలు సాగించవచ్చని తెలిపారు. గరుడ సేవకు 2,714 ట్రిప్పులు నడపనున్నట్లు చెప్పారు. సుమారు 2.50 లక్షల మంది భక్తులను తరలించవచ్చని వివరించారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ప్రజా రవాణా అధికారి జగదీష్, తిరుపతి డిప్యూటీ సీడీఎం భాస్కర్, మెకానిక్ ఇంజినీర్ నరసింహులు, తిరుమల డీఎం విశ్వనాథం పాల్గొన్నారు.

## వివాహిత.. ముగ్గురు పిల్లలు అదృశ్యం

చిత్తూరు అర్బన్: నగరంలో ఎస్.రమణమ్మ (24) అనే వివాహిత అదృశ్యమైంది. నగరంలోని పాంచాలపురం ఏరియాకు చెందిన ప్రకాష్‌కు తమిళనాడులోని కాంచీపురం పట్టణంలోని రమణమ్మతో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. బుట్టలు అల్లుతూ ప్రకాష్ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం నుంచి తన భార్య, పిల్లలు కనిపించడంలేదని ప్రకాష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ నెట్టికంటయ్య తెలిపారు.

## వ్యక్తి ఆత్మహత్యాయత్నం

చిత్తూరు అర్బన్:నగరంలో వినోద్‌కుమార్ (58) అనే వ్యక్తి పెట్రోలు పోసుకుని మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. టూటౌన్ సీఐ నెట్టికంటయ్య కథనం మేరకు.. చిత్తూరు నగరంలోని స్వామిమేస్త్రీ వీధికి చెందిన వినోద్ కుమార్ తన భార్యతో విడిపోయి వేరుగా ఉంటున్నాడు. కొంతకాలంగా ఒంటరి తనాన్ని భరించలేక ఒత్తిడితో ఉన్నాడు. మంగళవారం ఉదయం తేనెబండ సమీపంలో ఉన్న తన కారు షెడ్డుకు వెళ్లి పెట్రోలు పోసుకుని నిప్పటించుకున్నాడు. 80 శాతం గాయాలతో ఉన్న ఇతడ్ని స్థానికులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# రాజకీయ కక్షలతోనే వేధింపులు


గోవిందయ్య, సర్పంచ్, బొమ్మయ్యపల్లె

వెదురుకుప్పం: పంచాయతీలో ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కరిస్తున్నాను.. ప్రభుత్వ నిధులతో గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాను.. అయినా కేవలం రాజకీయ కక్షతోనే మూడు నెలలుగా తనని వేధింపులకు గురిచేస్తూ తప్పుడు కేసులు పెట్టి, ఇబ్బందుల పాలుజేస్తున్నారని మండలంలోని బొమ్మయ్యపల్లె సర్పంచ్ చొక్కా గోవిందయ్య ఆవేదన వ్యక్తం చేశారు. 2024 సాధారణ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే థామస్‌కు వ్యతిరేకంగా పనిచేశానన్న కక్షతో తనపై లేనిపోని అభియోగాలు మోపుతూ బెదిరిస్తున్నారని తెలిపారు. దళిత సర్పంచ్ అన్న జ్ఞానం కూడా లేకుండా దళిత ఎమ్మెల్యే థామస్ జిల్లాస్థాయి అధికారులపై ఒత్తిడి చేసి, తనకు చెక్ పవర్ రద్దు చేయించి, తనని మానసికంగా కృంగదీస్తున్నారని పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన వెదురుకుప్పంలో విలేకరుల ఎదుట వెల్లడించి వివరాలు ఆయన మాటల్లోనే..

- బొమ్మయ్యపల్లె పంచాయతీలో వార్డు మెంబర్‌గా ఉన్న టీడీపీ నాయకుడు పయణి 2019 మే 3వ తేదీన దేవళంపేటలోని పంచాయతీ స్థలాన్ని షాపింగ్ కాంప్లెక్స్ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకున్న ఉదంతాన్ని సర్పంచ్‌గా తాను బయట పెట్టినందుకు, సదరు కాంప్లెక్స్‌ను కూలదోసి, ఆ స్థలాన్ని కబ్జా చేస్తాడని భావించి పంచాయతీ తీర్మానం ఇవ్వడానికి నిరాకరించాను.
- అదే గ్రామానికి చెందిన సతీష్ నాయుడు ఎమ్మెల్యే థామస్‌ను అడ్డుపెట్టుకుని జెడ్పీ నిధులతో దేవళంపేట చెరువు మొరవ పూడ్చివేతకు ప్రయత్నించగా స్థానికుల నుంచి వ్యతిరేకత రావడంతో అడ్డుకున్నాను.
- డీపీఓకి సతీష్ నాయుడు బంధువు (మేనత్త) అవడంతో పంచాయతీ తీర్మానం ఇవ్వాలని డీపీఓ తనను ఒత్తిడి చేశారు. అయిన్పటికీ మొరవను పూడ్చేందుకు అంగీకరించలేదు.
- రాజకీయ దురుద్దేశంతోనే దేవళంపేటలోని షాపింగ్ కాంప్లెక్స్ వేలం పాటని ఆపారని, దీనిపై తాను హైకోర్టుకు వెళ్లడంతో కక్ష పెంచుకున్నారన్నారు.
- ఇలాంటి పరిణామాల నేపథ్యంలో ఉద్దేశపూర్వకంగానే పంచాయతీ రికార్డులను డీపీఓ కార్యాలయానికి తీసుకెళ్లినట్లు తెలిపారు.
- కేవలం తాను వైఎస్సార్‌సీపీ నాయకుడు అయినందుకే తనపై అధికార పార్టీకి చెందిన వారు అధికారులను ఒత్తిడి చేసి, పంచాయతీలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయనీయకుండా అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు.
- గత కొద్ది రోజులుగా తనను టార్గెట్ చేస్తూ అధికార పార్టీకి చెందిన వారు వేధింపులకు గురి చేస్తున్న పరిణామాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాను. అయినప్పటికీ తన చెక్ పవర్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

నేను ఏతప్పూ చేయలేదు కేవలం రాజకీయ కారణాల నేపథ్యంలో నన్ను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని, పంచాయతీ నిధులను డ్రా చేసి స్వప్రయోజనాలకు వాడుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. తాను పంచాయతీ ప్రజలకు రుణపడి ఉంటానని స్పష్టం చేశారు.

# తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత బిడ్డలదే

- జూనియర్ సివిల్ జడ్జి లిఖిత

పలమనేరు: తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత బిడ్డలదేనని, ఎవరైనా తల్లిదండ్రులను సంరక్షించకుండా ఇబ్బందులు పెడుతున్న బిడ్డలపై కోర్టులో ఫిర్యాదు చేసి, న్యాయాన్ని పొందే అవకాశం ఉందని పలమనేరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి లిఖిత పేర్కొన్నారు. స్థానిక కోర్టులో జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. అనంతరం సీనియర్ సిటిజన్లతో సమావేశం నిర్వహిటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు ఆదేశాలతో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించినట్లు తెలిపారు. తల్లిదండ్రులకు భోజనం పెట్టకుండా ఇంటి నుంచి గెంటివేయడం, వారిని బలవంతంగా ఆశ్రమాల్లో చేర్పించడం, వారి బాగోగులను పట్టించుకోకపోవడం చట్టరీత్యానేరమన్నారు. ఇందుకు ప్రత్యేక చట్టాలున్నాయని, అవసరమైన వారు స్థానిక కోర్టులో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ సిటిజన్లు పట్టణంలోని సమస్యలను విన్నవించారు. ఇండియన్‌బ్యాంకు వద్ద ట్రాఫిక్ సమస్య, బజారు వీధిలో బైక్‌రైడర్లతో రోడ్లపై వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని సిద్దయ్య, కృష్ణమూర్తి, మోహన్ తదితరులు తెలిపారు. సంబంధిత శాఖల ద్వారా ఈ సమస్యను పరిష్కరిస్తామని ఆమె పేర్కొన్నారు.

# అశ్వియ ఆచూకీ ఎక్కడ?

- పోలీసులకు సవాల్‌గా కేసు
- విలవిలలాడుతున్న కుటుంబం


పుంగనూరులో అదృశ్యమైన బాలిక అశ్వియ

పుంగనూరు: పట్టణానికి చెందిన చిన్నారి అశ్వియ అదృశ్యమై 48 గంటలు గడుస్తున్న పోలీసులు ఆచూకీ కనుగొనలేకపోతున్నారు. బాలికను ఎవరైనా కిడ్నాప్ చేశారా..? ఎలా అదృశ్యమైందన్న విషయాలపై కూడా పోలీసులు ఒక నిర్ధారణకు రాలేకపోవడంతో పట్టణ జనం రాత్రి, పగలు జాగరణ చేస్తూ భయాందోళన చెందుతున్నారు. పట్టణంలోని యూబీ కాంపౌండ్‌కు చెందిన అజ్మతుల్లా కుమార్తె అశ్వియ(7) ఆదివారం రాత్రి పక్క ఇంటి పిల్లలతో ఆడుకుంటు అదృశ్యమైంది. దీంతో తల్లి దండ్రులు, స్నేహితులు బాలిక ఆచూకీ కోసం గాలించారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. పోలీస్ జాగిలాలు కూడ జాడ కనిపెట్టడంలో విఫలమయ్యాయి.

**పుంగనూరులో ఎస్పీ మకాం**

బాలిక అశ్వియ జాడ కనుగొనేందుకు చిత్తూరు ఎస్పీ మణికంఠ చందవోలు రెండో రోజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మకాం పెట్టారు. చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, ఏఆర్‌డీఎస్పీ వల్లి, సీఐలు భాస్కర్, శ్రీనివాసులు, ఉమామహేశ్వరరావుతోపాటు పలువురు ఎస్‌ఐలు, పోలీసులు బాలిక ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

**సీసీ కెమెరాల పరిశీలన**

బాలిక ఆచూకీ కనుగొనేందుకు 11 పోలీస్ బృందాలు, పట్టణంలోని సీసీ కెమెరాలను నిశితంగా పరిశీలించారు. అలాగే బాలిక తల్లిదండ్రుల కాల్‌డేటాలను సేకరించారు. వారి ప్రవర్తనలపై నిఘా పెట్టారు. బాలిక తల్లిదండ్రులను పోలీసులు వేర్వేరుగా విచారించారు. బాలిక తండ్రి అజ్మతుల్లా స్వగ్రామమైన సోమల మండలం, నంజంపేటలో ఆస్తి తగాదాలు, కుటుంబ సభ్యులతో వివాదాలు, డబ్బు లావాదేవీలు ఏమైనా ఉన్నాయా? అన్న కోణంలో దర్యాప్తు చేపట్టారు.

**నేతల పరామర్శ**

పట్టణంలో అశ్వియ అదృశ్యం కావడంతో వైఎస్సార్‌సీపీ సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జి ఫకృద్దీన్ షరీఫ్, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కౌన్సిలర్లు అమ్ము, సాజిదాబేగంతో ముస్లిం యూత్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

**బాలిక అదృశ్యంపై డీఐజీ విచారణ**


పుంగనూరు స్టేషన్‌లో ఎస్పీ మణికంఠకు సూచనలిస్తున్న డీఐజీ హిమోషి బాజ్‌పాయ్

పుంగనూరు: పట్టణంలో అశ్వియ(7) అదృశ్యంపై అనంతపురం డీఐజీ హిమోషి బాజ్‌పాయ్ విచారణ జరిపారు. డీఐజీ మంగళవారం రాత్రి పుంగనూరు చేరుకున్నారు. కేసుకు సంబంధించి ఎస్పీ మణికంఠ చందవోలుతో చర్చించారు. తరువాత 11 బృందాల పోలీసులతో ఆమె వేర్వేరుగా కేసు వివరాలు తెలుసుకుని వెళ్లారు. ఈ సందర్భంగా విలేకరులు ఎస్పీని కేసు వివరాలు అడగ్గా ఈ కేసు సున్నితమైందని, దర్యాప్తు చేస్తున్నామని, బయటకు చెప్పకూడదని తెలిపారు. డీఐజీ వెంట డీఎస్పీలు ప్రభాకర్, సాయినాథ్, వల్లీ, సీఐలు భాస్కర్, శ్రీనివాసులు, ఉమామహేశ్వర్, ప్రసాద్‌బాబు ఉన్నారు.

**టవర్ డంప్ చే వివరాల సేకరణ**

పట్టణంలో అదృశ్యమైన అశ్వియ కేసును ఛేదించేందుకు ఎస్పీ మణికంఠ చందవోలు ఆధ్వర్యంలో టవర్ డంప్ టీమ్‌ను రప్పించారు. విజయవాడకు చెందిన ప్రత్యేక నిపుణులైన పోలీసులు మొబైల్ కాల్‌డేటాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. దీని ద్వారా కేసును ఛేదించడం సులభమవుతుందని పోలీసులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.